2

# పరిశుద్ధాత్మను గూర్చిన యేసు బోధ

*"ఆదరణకర్త, అనగా తండ్రి నా నామమున పంపబోవు పరిశుద్ధాత్మ సమస్తమును మీకు బోధించి నేను మీతో చెప్పిన సంగతులన్నిటిని మీకు జ్ఞాపకము చేయును" (యోహాను 14:26).*

పరిశుద్ధాత్మను గూర్చి ప్రభువైన యేసు బోధించినదానిలో ఎక్కువ భాగం యోహాను సువార్తలో ఉంది. అపొస్తలులు ఏమి చెప్పవలసియుందో దానిని ఆత్మ వారికి తెలుపుతాడనే వాగ్దానం మొదటి మూడు సువార్తలలో ఉంది (మత్తయి 10:19, 20; మార్కు 13:11; లూకా 12:12). పరిశుద్ధాత్మను దూషించడాన్ని గూర్చిన హెచ్చరికయు వాటిలోనే చేర్చబడింది (మత్తయి 12:31, 32; మార్కు 3:29; లూకా 12:10). దేవుని ఆత్మ శక్తిచేత ఆయన దయ్యములను వెళ్లగొట్టుచున్నట్టు ప్రభువు చెప్పిన మాటలు మత్తయి సువార్తలోనే దాఖలు చేయబడ్డాయి (12:28), అంతేకాదు తండ్రియొక్కయు, కుమారునియొక్కయు, పరిశుద్ధాత్మయొక్కయు నామమున బాప్తిస్మం యివ్వాలనే ప్రభువు మాటలు కూడ యిందులోనే ఉన్నాయి (28:19). పరిశుద్ధాత్మ యొక్క సహాయము ద్వారా దావీదు పలికినట్టు రెండు సువార్త రచనలు బయలుపరచుచున్నాయి (మత్తయి 22:43; మార్కు 12:36).

## లూకా సువార్తలో క్రీస్తు ప్రతిపాదన

పరిశుద్ధాత్మ యివ్వబడడాన్ని గూర్చిన ప్రభువువారి ప్రతిపాదనను లూకా దాఖలు చేశాడు: "కాబట్టి మీరు చెడ్డవారైయుండియు, మీ పిల్లలకు మంచి యీవులనియ్య నెరిగియుండగా పరలోకమందున్న మీ తండ్రి తన్ను అడుగువారికి పరిశుద్ధాత్మను ఎంతో నిశ్చయముగా అనుగ్రహించును" (లూకా 11:12, 13). దీన్ని యిలాగే తీసికొంటే, ప్రార్థించుట ద్వారా పరిశుద్ధాత్మను ఒక వ్యక్తి పొందవచ్చునన్నట్టు ఈ వచనం సూచిస్తుంది. ఏదియెలాగున్నా, పరిశుద్ధాత్మను పొందడానికి ప్రార్థనకంటెను ఎక్కువైనది కావలెనని యితర లేఖన భాగాలను పరిశీలించుటవలన తేటపడుతుంది.

మత్తయిలో ఈలాటి ప్రతిపాదన ఒకటి చేయబడింది: "మీరు చెడ్డవారైయుండియు మీ పిల్లలకు మంచి యీవుల నియ్య నెరిగియుండగా పరలోకమందున్న మీ తండ్రి

తన్ను అడుగువారికి అంతకంటె ఎంతో నిశ్చయముగా మంచి యీవులనిచ్చును" (7:11). దేవునినుండి వరములను లేక యీవులను పొందడానికి అడుగుటకంటెను ఎక్కువైనది కావలెనని యితర లేఖన భాగాలు బోధిస్తున్నాయా? దీనికి జవాబు "అవును" అని బిగ్గరగా చెప్పడమే!

"మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము" అని దేవుని అడుగునట్లు క్రీస్తు తన అపొస్తలులకు బోధించారు (మత్తయి 6:11). కేవలం అడిగితే చాలు, అనుదినాహారం అనుగ్రహింపబడునని ఎవడు వాదిస్తాడు? మన అవసరతలు తీర్చబడడానికి మనం పనిచేయాలి. పౌలు యిలా రాశాడు,

> దొంగిలువాడు ఇకమీదట దొంగిలక అక్కరగలవానికి పంచిపెట్టుటకు వీలుకలుగు నిమిత్తము తన చేతులతో మంచి పనిచేయుచు కష్టపడవలెను (ఎఫెసీ. 4:28).

> ఎవనియొద్దను ఉచితముగా ఆహారము పుచ్చుకొనలేదు; మేము మీలో ఎవనికిని భారముగా ఉండకూడదని ప్రయాసముతోను కష్టముతోను రాత్రింబగళ్లు పనిచేయుచు జీవనము చేసితిమి. ... మరియు మేము మీయొద్ద ఉన్నప్పుడు – ఎవడైనను పనిచేయ నొల్లని యెడల వాడు భోజనము చేయకూడదని మీకు ఆజ్ఞాపించితిమి గదా. మీలో కొందరు ఏ పనియు చేయక పరులజోలికి పోవుచు, అక్రమముగా నడుచుకొనుచున్నారని వినుచున్నాము. అట్టివారు నెమ్మదిగా పనిచేయుచు, సొంతముగా సంపాదించుకొనిన ఆహారము భుజింపవలెనని మన ప్రభువైన యేసు క్రీస్తు పేరట వారిని ఆజ్ఞాపూర్వకముగా హెచ్చరించుచున్నాము (2 థెస్స. 3:8–12).

ఆయన దీవెనల కొరకు ప్రార్థించువారు తగిన కార్యాలను జరిగించాలని దేవుడు కోరుచున్నాడు. దేవుని యొద్దనుండి యీవిని పొందడానికి గాను, ఒకడు ప్రభువైన యేసు నామమున అడగాలి (యోహాను 14:14), విశ్వాసంతో అడగాలి (యాకోబు 1:6, 7), సరియైనవాటిని అడగాలి (యాకోబు 4:3), దేవుని చిత్తానుసారమైన మనవులు చేసికోవాలి (1 యోహాను 5:14) వీటితోపాటు దేవుని ఆజ్ఞలను గైకొంటూ ఆయన దృష్టికి యిష్టమైనవాటిని జరిగించుతూ ఉండాలి (1 యోహాను 3:22).

ఆలాగుననే, పరిశుద్ధాత్మ యివ్వబడక మునుపు దేవుని అడిగేదానికంటె ఎక్కువైనది జరగాలి. కేవలం ప్రార్థించిన దానిని బట్టియే పరిశుద్ధాత్మను అనుగ్రహించినట్టు బైబిల్లో ఒక్క ఉదాహరణ కూడ లేదు.

## యోహాను సువార్తలో క్రీస్తు బోధ

పరిశుద్ధాత్మను గూర్చి ప్రభువైన యేసు చెప్పిన మిగిలిన సంగతులు యోహాను సువార్తలో కన్పిస్తాయి. క్రొత్త జన్మలో పరిశుద్ధాత్మ యొక్క కార్యము (యోహాను 3:3–5) ఆ తరువాత పరిశుద్ధాత్మ అంతరంగములోని నివాసము (యోహాను 14:17) తక్కిన పాఠాల్లో చర్చించుతాను.[1] ఈ పాఠం యొక్క ముఖ్య ఉద్దేశం యోహాను 14:16, 17, 26; 15:26; 16:13లోని ప్రభువువారి ప్రతిపాదనలపై దృష్టి నిలపడమే.

**సెట్టింగ్ (పరిస్థితి)**

పరిశుద్ధాత్మను గూర్చి ప్రభువు చేసిన వాగ్దానాల సెట్టింగ్ బహు ప్రాముఖ్యమైనది. అప్పుడు ప్రభువైన యేసు ఎక్కడున్నారు? ఆయనతో ఉన్నవారెవరు? ఆయన ఎవరితో మాట్లాడుతున్నారు?

మన ఆలోచనలో ఉన్న ప్రతిపాదనలు ప్రభువైన యేసును ఆయన అపొస్తలులును పస్కా భోజనము మరియు ప్రభురాత్రి భోజనమును జరిగించిన మేడగదిని విడువకముందు చేయబడినవి. పేద విధవరాలి కానుకను గమనించి (మార్కు 12:41–44; లూకా 21:1–4). యెరూషలేము దేవాలయాన్ని విడిచిన తరువాత యేసును ఆయన శిష్యులును ఒలీవకొండకు నడిచివెళ్లారు (మత్తయి 24:3; మార్కు 13:1–3). పస్కా సమీపించుతుండగా, ప్రభువు తన శిష్యులలో యిద్దరిని (మార్కు 14:13) పట్టణంలోనికి పంపారు (పట్టణం పేరు ప్రస్తావింపబడకపోయినా, అది యెరూషలేమనేది విదితమే). ఇది పస్కా భోజనాన్ని ఆచరించడానికి ఏర్పాట్లు చేయడం కొరకు (మత్తయి 26:18; మార్కు 14:14; లూకా 22:10, 11). వారు పస్కా భోజనం చేయగలుగునట్లు (మార్కు 14:14, 15; లూకా 22:11, 12), పదార్థాలతో నింపబడిన ఒక పెద్ద గది – ఒక విడిది గదిని గూర్చి విచారింప వారు ఆజ్ఞపొందారు.

“సాయంకాలమైనప్పుడు ఆయన తన పండ్రెండుమంది శిష్యులతో కూడ వచ్చెను” (మార్కు 14:17), అక్కడ ఆయన తన అపొస్తలులతో భోజన పంక్తిని కూర్చున్నారు (లూకా 22:14; మత్తయి 26:20). పస్కా భోజన సమయములో ప్రభువుతో కూడ ఉన్నవారు తన అపొస్తలులు మాత్రమే.

యోహాను 13–16లో దాఖలు చేయబడినట్టు ప్రభువైన యేసు చర్చకు సంబంధించిన కాల వ్యవధిని యోహాను సూచించాడు. ఆ పస్కా భోజన ప్రారంభానికి ముందే తాను వెడలిపోవు కాలము ఆసన్నమైనదని ఆయన ఎరిగియున్నారు (యోహాను 13:1). “భోజనపంక్తినుండి లేచి ...” (యోహాను 13:2–4) ఇతర సువార్త రచనల్లో యివ్వబడిన సమాచారంతో దీన్ని జోడించి, పస్కా భోజన సమయంలో ప్రభువుతో కూడ ఉన్నవారు తన పండ్రెండుమంది అపొస్తలులేయని రూఢిగా చెప్పవచ్చు. ఆ మేడగదిలోని సంఘటనలకును చర్చకును వారు మాత్రమే కలిసియున్నారు. యూదా వెళ్లిపోయిన తరువాత, యిక పదకొండుమందే ప్రభువుతో కలిసియున్నారు (యోహాను 13:30). ఈ అపొస్తలులను మించి యిందులో ఎవరిని చేర్చినా సెట్టింగ్ దెబ్బతింటుంది.

**చేర్చబడిన ప్రజలు**

యోహాను 13–16ల్లోని సమాచారాన్ని క్రీస్తు తన అపొస్తలులకు వివరిస్తుండగా, ఆయా గుంపులను ఆయన సూచిస్తూ వచ్చారు. (1) “మీరు” అని ప్రభువు యిందులో అన్నప్పుడు, అపొస్తలులు అని మాత్రమే గాని క్రైస్తవులందరిని ఆయన సూచింపలేదు. అపొస్తలులకు వాగ్దానం చేసింది యితర క్రైస్తవులకు వర్తించాలని కోరుకున్నట్టయితే, యితర లేఖనాల మీద మనం ఆధారపడవలసిందేగాని నేరుగా ఈ భాగంలోనుండి వర్తింపజేసికో వల్లపడదు. అలాటి లేఖన భాగాలు కన్పించకపోతే మాత్రం, యిందులోని

వాగ్దానాలు కేవలం అపొస్తలులకు మాత్రమేయని అంగీకరించి తీరాలి. (2) "అతడు," "వానిని," "ఒక మనిషి" లేక "వారు" అని ప్రభువైన యేసు అన్నప్పుడు, అపొస్తలులతో పాటు సాధారణంగా విశ్వాసులైనా చేర్చబడాలి, లేదా అపొస్తలులు కాకుండ కేవలం యితరులు అన్నా అయ్యుండాలి.

"పిల్లలారా, యింక కొంతకాలము మీతోకూడ ఉందును; మీరు నన్ను వెదకుదురు ..." (యోహాను 13:33). ఈ సందర్భంలో, "మీరు" అని ప్రభువు పలికింది అపొస్తలులనే. ఏదియెలాగున్నా, "మీరు" (అపొస్తలులు) లకు సంబంధించి చెప్పబడింది, గతంలో యూదులకు వర్తించబడింది. "నేను యూదులతో చెప్పిన ప్రకారము ఇప్పుడు మీతోను చెప్పుచున్నాను" (యోహాను 13:33). ఇక్కడ ప్రభువు ప్రత్యేకించి అపొస్తలులతో మాట్లాడుతున్నారు, అపొస్తలులు కాని ప్రజలు అదే పరిస్థితిని ఎదుర్కొంటారని ఆయన వేరొక సందర్భంలో చెప్పారు.

"మీరు ఒకరి నొకరు ప్రేమింపవలెనని మీకు క్రొత్త ఆజ్ఞ ఇచ్చుచున్నాను" (యోహాను 13:34ఎ). ఈ ఆజ్ఞ అపొస్తలులకు యివ్వబడింది, కాని క్రీస్తువారి శిష్యులందరు ఒకరి నొకరు ప్రేమించుకోవాలని క్రొత్తనిబంధన సూచిస్తుంది (1 యోహాను 3:23).

"నా ఆజ్ఞలను అంగీకరించి వాటిని గైకొనువాడే నన్ను ప్రేమించువాడు" (యోహాను 14:21ఎ). "వాడే" అనే పద ప్రయోగాన్ని ప్రభువు చేయడంవలన, అందులో కేవలం అపొస్తలులను మాత్రమే ఆయన చేర్చలేదు. ఆయన ఆజ్ఞలను గైకొనువాడెవడైనను అందులో ఉన్నట్టే.

"లోకులు నన్ను హింసించినయెడల మిమ్మును కూడ హింసింతురు" (యోహాను 15:20బి). "లోకులు" ("వారు") అని ఈ లేఖన భాగంలోని భావం అపొస్తలులు కాని వారు అని, "మిమ్మును" అనగానే కేవలం అపొస్తలులని అర్థం.

ఈ క్రింది ప్రతిపాదనలు కేవలం అపొస్తలులకు మాత్రమే చేయబడ్డాయి:

> "అవి జరుగుకాలము వచ్చినప్పుడు, నేను వాటిని గూర్చి మీతో చెప్పితినని మీరు జ్ఞాపకము చేసికొనులాగున యీ సంగతులు మీతో చెప్పుచున్నాను; నేను మీతో కూడ ఉంటిని గనుక మొదటనే వీటిని మీతో చెప్పలేదు" (యోహాను 16:4).
>
> "కొంచెము కాలమైన తరువాత మీరిక నన్ను చూడరు" (యోహాను 16:16ఎ).
>
> "ఈ సంగతులు గూఢార్థముగా మీతో చెప్పితిని; అయితే నేనిక యెన్నడును గూఢార్థముగా మీతో మాటలాడక ..." (యోహాను 16:25).
>
> "యిదిగో మీలో ప్రతివాడును ఎవని యింటికి వాడు చెదరిపోయి నన్ను ఒంటరిగా విడిచిపెట్టు గడియ వచ్చుచున్నది, వచ్చేయున్నది ..." (యోహాను 16:32ఎ).

ఈ సందర్భాలలో "మీరు" అనే పదాన్ని ప్రభువు ఉపయోగించినప్పుడు, ఆయన ప్రత్యేకించి అపొస్తలులనే సూచించారు. ఇతరులు కూడ అదే ఉపకారము పొందుదురని యితర లేఖన భాగాలు సూచింపకున్నట్టయితే, అప్పుడు ఈ ప్రతిపాదనలు అపొస్తలులకే వర్తిస్తాయి మరెవరికిని వర్తించవని తెలిపోతుంది. దీన్ని గ్రహించడం అవసరం ఎందుకంటే

– యోహానులోని ఈ భాగం పరిశుద్ధాత్మ యొక్క పనిని గూర్చి మాట్లాడింది వాగ్దానం చేసింది ప్రత్యేకించి అపొస్తలులకే.

### వాగ్దానం చేయబడిన ఆత్మ

పరిశుద్ధాత్మ యొక్క రాకను గూర్చి ప్రభువు వాగ్దానం చేసింది (యోహాను 14:16-26; 15:26, 27; 16:7-15) అపొస్తలులకు మాత్రమే. ఈ లేఖన భాగాల సందర్భాలను బట్టి అది విదితమైయుంది: "నేను మీయొద్ద ఉండగానే యీ మాటలు మీతో చెప్పితిని" (యోహాను 14:25). "మీరు మొదటనుండి నాయొద్ద ఉన్నవారు గనుక మీరును సాక్ష్యమిత్తురు" (యోహాను 15:27); "నేను మీతో చెప్పవలసినవి ఇంకను అనేక సంగతులు కలవు గాని యిప్పుడు మీరు వాటిని సహింపలేరు" (యోహాను 16:12). ఎవరితో ప్రభువు నివసిస్తున్నారో, ఎవరు ఆయనకు సాక్షులుగా నిలిచియుండ బోతున్నారో, ఆయన పరిచర్య ఆరంభంనుండి ఎవరు ఆయనతో కూడ ఉన్నారో, తన బోధ సంపూర్ణతను ఎవరు పూర్తిగా సహించలేకయున్నారో – వారితో ఈ ప్రతిపాదనలు చేసారు. ఈ లేఖన భాగాలు అపొస్తలులను సూచిస్తాయి.

ఆత్మ వచ్చి ఏమి చేస్తాడని ప్రభువు వాగ్దానం చేశారో అందులో అపొస్తలులు మాత్రమే చేర్చబడ్డారు. ఆయన వచ్చి (1) సమస్తమును వారికి బోధిస్తాడు. (2) ప్రభువు అపొస్తలులకు ఏమైతే బోధించారో వాటన్నిటిని పరిశుద్ధాత్మ వారికి జ్ఞాపకం చేస్తాడు. (3) వారిని సర్వసత్యములోనికి నడిపిస్తాడు. (4) మరియు సంభవింపబోవు సంగతులను వారికి తెలియజేస్తాడు (యోహాను 14:26; 16:13).

నేటి ప్రజలకు పరిశుద్ధాత్మ అదే కార్యాలను చేస్తే ఏమి జరుగుతుంది? (1) వీరికి బైబిలు అవసరముండదు, అవసరమైన ఆత్మసంబంధమైన తెలివిని ఆత్మ స్వయంగా తానే ప్రసాదిస్తాడు. (2) వీరు యేసు యొక్క బోధలను చదవవలసిన అవసరం లేదు. యేసు చెప్పినది యావత్తు ఆత్మ తానే వారి మనస్సుల్లోనికి తెస్తాడు. (3) చదువవలసిన ప్రాథమిక హేతువు వారికుండదు. ఆత్మయే వారిని సర్వసత్యంలోనికి నడిపించును. (4) ఏమి ఉపదేశించాలో సిద్ధపడవలసిన అవసరతగాని, యోచించుకొనవలసిన అవసరంగాని ఉండదు. ఆత్మయే వారికి సరియైన పదాలను యిస్తూ ఉంటాడు (మత్తయి 10:19, 20). (5) ఆత్మచేత ప్రేరేపింపబడిన పౌలువలె (గలతీ. 1:11, 12) వీరికి ఉపదేశం అవసరముండదు, కాని ప్రభువు యొక్క బోధను ఆత్మద్వారా నేరుగా వీరు పొందుతారు (ఎఫెసీ. 3:3-5). (6) దైవప్రేరేపితులుగా బైబిలు లేఖికుల ఉపదేశానికి సమానంగా వారి ఉపదేశం ఉంటుంది. బైబిలు లేఖికులను నడిపించిన ఆత్మయే వారిని కూడ నడిపిస్తుంది. (7) ఏ తప్పు చేయకుండ వారు మాట్లాడగలరు రాయగలరు. బైబిలు లేఖికులు దైవ సందేశం లోపంలేనిదిగా రాయడానికి ఆత్మ వారిని నడిపించింది. ఈ వాస్తవాన్ని ఆధారం చేసికొని, బైబిలు సంపూర్ణమైనదని, లోపము లేనిదని మనం విశ్వసించగలం. (8) వారు భవిష్యత్తులోనికి తేరిచూచి ఏమి సంభవించబోతుందో తెలిసికోగలరు. నేటి బూటకపు ప్రవక్తలు, జ్యోతిష్యులవలె కాక, రాబోవు సంగతులను తప్పుపోకుండ చెప్పగలరు.

అపొస్తలులతోపాటు ప్రవక్తలు కూడ ప్రత్యక్షతను పొందినట్టు లేఖనాలు

చెప్పుతున్నాయి (ఎఫెసీ. 3:3–5). అపొస్తలులు చేతులుంచుటవలన వారు ఆత్మతో నింపబడినవారయ్యారు (అపో. 6:6). ఈ విధంగా, రాతరూపంలో వాక్యము లభ్యంకాక ముందు, ఆత్మద్వారా అది నోటిమాటలద్వారా ప్రసాదింపబడింది.

అపొస్తలులకును, ప్రవచన వరము పొందిన క్రొత్త నిబంధన క్రైస్తవులకును వ్యత్యాసమేమంటే, అపొస్తలులకు సమస్తం బోధించబడింది, యేసు బోధించిన వాటినన్నిటిని పరిశుద్ధాత్మ జ్ఞాపకం చేయడం, ఆత్మ వారిని సర్వసత్యంలోనికి నడిపించగా, తక్కినవారు పాక్షిక ప్రత్యక్షతను పొందారు. వారు ఎరుగవలసిన దానినంతటిని పరిశుద్ధాత్మ బయలు పరచినందున, సత్యంకొరకు అపొస్తలులు మరి ఎవరి మీదను ఆధారపడవలసినవారు కాకుండిరి. సత్యము బయలుపరచబడిన (ప్రవక్తలు) యితర క్రైస్తవులు సయితం (యోహాను 14:26), సంపూర్ణ ప్రత్యక్షతకొరకు అపొస్తలుల మీద ఆధారపడవలసినవారై యున్నారు (2 తిమోతి 2:2).

## ఆదరణకర్త

ఆత్మను ఆదరణకర్తయని క్రీస్తు ప్రభువు తెలిపారు (Gk.: *parakletos*).

> పరిశుద్ధాత్మకు వర్తింపచేయబడగా, ఆ గ్రీకు పదము ఏ ఆంగ్ల పదముతో తర్జుమా చేసినా అది సరిపోనంత ఎక్కువైన భావం కలిగియుంటుంది. "ఆదిరించువాడు" KJV అనేది, తక్కినవి ఎంత చాలినవైయుంటాయో అదికూడ అలాగే ఉంటుంది – ఆదరించి, సహాయపడి, బలపరచి, ఆలోచన చెప్పి – న్యాయవాది తన ముద్దాయి పట్లచేసే సమస్త భావంతో అది తీసికొన్నట్టయితే సరిపోతుంది.[2]

యేసు తన అపొస్తలులతో ఉన్నంతకాలం, ఆయన వారి ఆలోచనకర్త, సహాయకుడు, ఆదరణకర్తగా ఉన్నారు. ప్రభువైన యేసు వారిని విడిచి వెళ్లిన తరువాత, ఆయన స్థలంలో నిలువడానికి పరిశుద్ధాత్మ వచ్చాడు. ప్రభువు తన అపొస్తలులకు యిలా వాగ్దానం చేశారు: "నేను తండ్రిని వేడుకొందును, మీ యొద్ద ఎల్లప్పుడు నుండుటకై ఆయన వేరొక ఆదరణకర్తను … మీకనుగ్రహించును" (యోహాను 14:16); "మిమ్మును అనాథలనుగా విడువను; మీయొద్దకు వత్తును" (యోహాను 14:18). యేసు తానే తిరిగి వారియొద్దకు వస్తారని కాదు, కాని, పరిశుద్ధాత్మ ద్వారా వారియొద్దకు వస్తాడని. ఈ విషయాన్ని ప్రభువు యిలా వివరించారు: "అయితే నేను మీతో సత్యము చెప్పుచున్నాను, నేను వెళ్లిపోవుటవలన మీకు ప్రయోజనకరము; నేను వెళ్లనియెడల ఆదరణకర్త మీయొద్దకు రాడు; నేను వెళ్లినయెడల ఆయనను మీయొద్దకు పంపుదును" (యోహాను 16:7). యేసే వారియొద్దకు వచ్చే ఆదరణకర్తయైన పరిశుద్ధాత్మ కాదు. ఆయన మరియొక సహాయకుని ఆదరణకర్తను (యోహాను 14:16) వారియొద్ద నిలిచియుండ పంపును.

## సమయం

పునరుత్థానుడైన ప్రభువు తన అపొస్తలులమీద ఊది పరిశుద్ధాత్మను పొందుడని

చెప్పినప్పుడు (యోహాను 20:19) ఆత్మ అపొస్తలుల మీదికి వచ్చినట్టు కొందరు తలంచారు. ఆ సమయములో ప్రభువు “పరిశుద్ధాత్మను పొందుడి” అని అన్నారు (యోహాను 20:22బి).

ప్రభువు భోజనం నియమించిన సమయంలో ఆయన మాటలను ఎలా అర్థం చేసికొన్నామో అలాగే ఈ మాటలను మనం అర్థం చేసికోవలసిన అవసరముంటుంది. అక్కడ ప్రభువు యిలా అన్నారు, “ఇది నా రక్తము, అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింపబడుచున్న నిబంధన రక్తము” (మత్తయి 26:28). ఆయన రక్తము “చిందింపబడకముందే” రక్తము చిందింపబడుతున్నట్టు ప్రభువు అక్కడ తెలిపారు. భవిషత్ సంగతులు ఎంత నిశ్చయముగా ఆయన చెప్పారంటే - జరుగక ముందే జరిగినంత నిశ్చయముగా ఆయన తెలిపారు. పరిశుద్ధాత్మ పొందే విషయంలో కూడ అంతే నిశ్చయంగా చెప్పారు.

క్రీస్తు ప్రభువు మహిమపరచబడిన తరువాత, ఆత్మ అనుగ్రహింపబడతాడని (యోహాను 7:39) సందేశమైయుంది. తన మరణం ద్వారా ఆయన మహిమపరచ బడతారని ప్రభువు సూచించారు (యోహాను 12:23, 24) ఆయన మరణ పునరుత్థానాల తరువాత ప్రభువు మహిమలో ప్రవేశించారు (లూకా 24:26; ఫిలిప్పీ. 2:8-11; 1 తిమోతి 3:16).

యెరూషలేమును విడిచి వెళ్లవద్దనియు, “కొద్ది దినాలలోనే” వారు అక్కడ పరిశుద్ధాత్మ బాప్తిస్మం పొందవలసినదనియు, తాను పరలోకమునకు వెళ్లకముందుగా ప్రభువు తన అపొస్తలులకు ఆదేశించారు (అపొ. 1:4, 5; లూకా 24:49 కూడ చూడు). ఆయన వెళ్లిన పది దినాల తరువాత, యూదుల పెంతెకొస్తను పండుగలో, పరిశుద్ధాత్మ వారిమీదికి బలముగా దిగివచ్చాడు (అపొ. 1:8; 2:1-4). ప్రభువు వారిమీద ఊదిన వెంటనే పరిశుద్ధాత్మను వారు పొందలేదు.

## ముగింపు

తాను వెడలిపోవు సమయం కొరకు ప్రభువు తన అపొస్తలులను సిద్ధపరచారు. తన స్థానంలో నిలిచి వారికి సహాయము చేయు ఆదరణకర్తయగు ఆత్మను ఆయన వారికి వాగ్దానము చేశారు. క్రీస్తు ప్రభువు వెళ్లిన తరువాత వారు విసర్జింపబడినవారుగా గాని, అనాథలుగా గాని విడువబడలేదు. పరిశుద్ధాత్మ ద్వారా ప్రభువు వారికి సహకారుడై యుంటాడు. ఈ విధంగా, సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి వారు సువార్తను ప్రకటించుచుండగా. సర్వ సత్యములోనికి వారు నడిపింపబడే ఆత్మ సంబంధమైన శక్తిని ప్రసాదించుతూ ఆత్మ వారిని నడిపిస్తాడు (మార్కు 16:15).

సూచనలు

[1]పరిశుద్ధాత్మను పొందడానికి ప్రార్థనకంటె యింకను ఎక్కువైనవి అవసరం. పరిశుద్ధాత్మ బాప్తిస్మమునకు సంబంధించిన పాఠంలోను ... ఈ విషయాన్ని చదువుతాం. [2]“Advocate,” *The New International Dictionary of the Bible,* eds. J. D. Douglas and Merrill C. Tenney (Grand Rapids, Mich.: Zondervan, 1987), 20.